# అ.అ. ఆ అవార్డ్

-ఎమ్. సి. ఆంజనేయులు



ప్రభుత్వంచే నియమించబడ్డ 'అవినీతి నేతల సెలెక్షన్ కమిటీ' అనేక వడపోతల తర్వాత 'అత్యంత అవినీతి ఆఫీసర్స్'గా, ఒకే శాఖలో పనిచేసిన ఇద్దరు ఆఫీసర్లని ఎంపిక చేసింది. వారు కోటేశ్వరరావు, లక్ష్మీప్రసాద్.

ఐదేళ్ళకొకమారు ప్రదానం చేసే అప్రతిష్ఠాత్మక అవార్డుకు - వీరిద్దర్లోంచి ఎవరు అర్హులో పికప్ చేసే పనిని - గుడి లింగేశ్వరరావుకు అప్పజెప్పింది.

ఉద్యోగ విరమణ చేయక మునుపు, ఆ అప్రతిష్ఠాత్మక "అ. అ. ఆ అవార్డ్" రెండుమార్లు సంపాదించు'కొన్న' ఘనత గుడి లింగేశ్వరరావుది.

ఆ ఉదయం పది గంటల ముప్ఫై నిముషాలకు ఆ ఆఫీసు గదిలో అడుగుపెట్టాడు లింగేశ్వరరావు. అప్పుడే వచ్చి సీట్లో సెటిల్ అవుతున్న మేనేజర్ సుబ్బారావును పిల్చి, తనెవరో, ఎందుకోసం వచ్చాడో బ్రీఫ్ చేసి, బ్రీఫ్ కేస్‌లోంచి ప్రభుత్వమిచ్చిన ఆర్డర్ తీసి చూపి, మానస సరోవర్ నిర్మాణానికి సంబంధించిన ఫైల్స్ మొత్తం తెచ్చి తనకు అప్పగించమన్నాడు గుడి లింగేశ్వరరావు.

నిముషాల మీద ఫైల్స్ తెచ్చి కుప్పపోసాడు మేనేజర్ సుబ్బారావు. ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తూ,

ఒక్కొక్క ఫైలే తిప్పుతూ, రిలవెంట్ పాయింట్స్ నోట్ చేసుకోవడం మొదలెట్టాడు లింగేశ్వరరావు. మానస సరోవర్ బాగోతం మా బాగా అర్థం కాసాగింది లింగేశ్వరరావుకు, పుటలు తిరగేసే కొద్దీ.

★ ★ ★

మానస సరోవర్ అనే పేరుతో ఆ నగరం నడిబొడ్డున, 70 లక్షల రూపాయల వ్యయంతో 'చేపట్టిన' ఆధునిక స్విమ్మింగ్ పూల్‌కి సంబంధించిన హైలెవెల్ స్కామది. ఆ స్కామ్‌కి అసలు స్కీమర్ కనకాలరావు అనే ఆఫీసర్. అవినీతిలో నిలువునా కూరుకుపోయాడనే నెపంతో, కనకాలరావుని ప్రమోట్ చేసి, ఆయన స్థానంలో కోటేశ్వరరావును నియమించింది ప్రభుత్వం.

కోటేశ్వరరావు మంచి రోజు చూసుకొని వచ్చి ఛార్జీ తీసుకొన్నాడు. టేబుల్ మీద పేరుకుపోయిన ఫైల్స్ ఒక్కొక్కటే చూపిస్తూ, కేస్ బ్రీఫ్ చేస్తూ, కోటేశ్వరరావు చేత సంతకాలు పెట్టిస్తున్నాడు, అసిస్టెంట్ రంగారావు.

"ఏమయ్యా రంగారావూ! ఇక్కడొక స్విమ్మింగ్ పూల్ వుండాలి కదా? ఎంత దూరంలో వుంది? వెళ్ళి ఓమారు ఇన్స్‌పెక్ట్ చేసొద్దామా?" అన్నాడు కోటేశ్వరరావు, రంగారావు ముఖంలోకి చూస్తూ.

ఏమని జవాబు చెప్పాలో తోచక ఓ నిమిషం తడబడ్డాడు రంగారావు. వెంటనే తమాయించుకొని, "అలాగే సార్! అలాగే! ఇన్స్పెక్షన్ సాయంత్రం ఏర్పాటు చేస్తాను. ఇంతలోగా కొన్ని ఫైల్స్ కూడా క్లియర్ అవుతాయ్" అన్నాడు రంగారావు.

"ఈ ఫైల్స్ దేముంది లేవయ్యా! ఈ దినం కాకపోతే రేపు చూడొచ్చు. ఫ్రెష్‌గా ఇప్పుడే వెళ్ళి చూసొద్దాం - పద'' అంటూ, గదిలోంచి బయటకొచ్చి, జీపుకేసి నడిచాడు కోటేశ్వరరావు. ఇక తప్పదన్నట్లు జీపువెనుక ఎక్కి కూర్చున్నాడు, రంగారావు.

జీపు ముందుకు దూసుకుపోయి, పది నిముషాల తర్వాత ఓ మైదానం వద్ద ఆగిపోయింది. జీపు ఆగీ ఆగగానే వెనుక సీట్లోంచి కిందికి దుమికి, ఇంకా జీపులోనే కూర్చొని వున్న బాస్ దగ్గరికి పరుగున వచ్చి చేతులు కట్టుకు నిలబడ్డాడు, రంగారావు.

"ఎందుకయ్యా రంగారావ్, అలా నీళ్ళు కారిపోతున్నావ్? ఇక్కడే కదా ఈత కొలను వుండాలి! కానీ, అదిప్పుడు లేదు. మెజీషియన్ సర్కార్ దాన్ని మాయం చేశాడని మనం బొంకితే ప్రభుత్వం నమ్ముతుందటయ్యా? ప్రభుత్వాన్ని నమ్మిస్తావే అనుకుందాచ్ - ప్రజలు నమ్ముతారా!? అందుచేత ఓ పనిచేద్దాం. దీన్ని నిర్మించి, అదే లేవయ్యా - రికార్డ్స్ ప్రకారం మూడేళ్ళు పూర్తయింది కదా! అహ.. అయింది కదయ్యా! డైవింగ్ బోర్డ్ చూడు - ఎలా కూలి విరిగిపడిపోయిందో! ఈత కొలను ఫ్లోరింగ్ చూడు - ఎలా గుంటలు పడి, హైదరాబాదు రోడ్ల మాదిరి తయారయిందో! పూల్ పక్కలకు పగుళ్ళు పడి గోడలు కూలిపోయేటట్లున్నాయ్. ఇవన్నీ వెంటనే బాగు చెయ్యాలి. అలాగే వదిలేస్తే - దీన్నెవరూ 'ఈత కొలను' అని అనరు - 'రోత కొలను' అంటారు. దేర్‌ఫోర్, వెంటనే ఓ రిపేర్స్ ఎస్టిమేట్ 10 లక్షలకు ప్రిపేర్ చేసి నాకు పంపు. శాంక్షన్ చేస్తాను.'' అధికారయుతంగా ఆదేశించాడు, కోటేశ్వరరావు.

ఎస్టిమేట్ తయారు చేయడం - 'పనులు' పూర్తవడం వెంటవెంటనే జరిగిపోయాయ్. రెండేళ్ళ తర్వాత కోటేశ్వరరావు మారిపోయి, ఆయన స్థానంలో లక్ష్మీప్రసాద్ బదిలీ మీద

## చూపిస్తున్నా

"ఎందుకురా బుజ్జీ, పాప ఏడుస్తున్నది", అన్నది కమల వంటింట్లోంచి.

"నోట్లో వేలు పెడితే కొరకడం లేదమ్మా, ఇలా కొరకాలని నేర్పిస్తున్నానంతే'' బదులిచ్చాడు బుజ్జి.

*- కలవకుంట్ల గురునాథ పిళ్ళై*

వచ్చాడు.

ఛార్జ్ తీసుకున్న మరుక్షణమే లక్ష్మీప్రసాద్ బ్రీఫ్ కేసులోంచి పాకెట్ సైజ్ లక్ష్మీదేవి పటాన్ని తీసి టేబుల్ మీద వుంచి నమస్కరించుకున్నాడు. అదే సమయంలో కర్టెన్ తొలగించి లోనికి తొంగి చూసాడు, రంగారావు.

"ఎవరది? నువ్వా - రంగారావ్! వచ్చి కూచో. (ఆ గదిలో కూచోడానికి కుర్చీలుంటేగా! తన కుర్చీ తప్ప మిగతావన్నీ తీయించి వేసాడు, తను ఛార్జి పుచ్చుకోగానే!)

"నీ జూరిష్‌డిక్షన్‌లో బ్రహ్మాండమైన స్విమ్మింగ్‌పూల్ వుందని విన్నాను. పద - నీ అందాల ఈత కొలను వెళ్ళి చూసొద్దాం కార్లో!" వ్యంగ్యంగా అని బయటకు నడిచాడు లక్ష్మీప్రసాద్.

కారు 'ఈతకొలను' కేసి పరుగులు తీసింది. కార్లోంచి దిగారు - ముందు లక్ష్మీప్రసాద్, ఆ వెనుక రంగారావు, ఆ మైదాన ప్రదేశంలో.

"ఏదీ కనబడదేం - నీ స్విమ్మింగ్ పూల్? ఏ వూరెళ్ళింది?!" వెటకారంగా అన్నాడు లక్ష్మీప్రసాద్.

"పెద్దలు ... మీకు తెలీందేముంది సార్!"

" ఓర్నీ... నన్నప్పుడే పెద్దల్లో కల్పేస్తున్నావా? భలే ఘటికుడిలా వున్నావే? సరేలే... ఇంతకీ స్విమ్మింగ్ పూల్ ఎక్కడుందో చూపించు..." కాస్త ధుమధుమలాడించాడు కంఠాన్ని, లక్ష్మీప్రసాద్.

దీనంగా బాస్‌కేసి చూస్తూ, నీళ్ళు నమిలాడు, రంగారావు.

"చూడు... ఇలారా... ఈ ముగ్గులోకి ఎవరూ దిగకుండా బయటపడాలంటే ఒకే ఒక్క మార్గముంది..."

రంగారావు ఆదుర్దాగా లక్ష్మీప్రసాద్ దగ్గరికి జరిగాడు.

" ఈ స్విమ్మింగ్‌పూల్ పక్కనే చిన్న పిల్లల స్కూలుంది కదా! అహ ఉంది కదా!! ఎందుకా బిక్కమొహం? అర్థం చేసుకోవయ్యా! స్కూలుకు వచ్చిపోయే పిల్లలు ఇందులోపడి చనిపోయే ప్రమాదం వుంది కదా! ఆ కారణంగా ఈ స్విమ్మింగ్‌పూల్‌ని మనం ఎంత తొందరగా పూడ్చివేస్తే అంత మంచిది. ఏమంటావ్?"

రంగారావు మొహంలో వెయ్యి వాట్ల బల్బు వెల్గింది. ఆనందంగా, "ఎస్ సర్... ఎస్ సర్" అన్నాడు, రెండుమార్లు.

"వెంటనే 20 లక్షలకు ఓ ఎస్టిమేట్ ప్రిపేర్ చేసి, కన్విన్సింగ్‌గా ఓ రిపోర్ట్ రాసి నాకు పంపు. శాంక్షన్ చేస్తాను. పూడ్చివేత పనులు, యుద్ధప్రాతిపదిక మీద, పక్కవాడికి తెలీకుండా పూర్తిచేసేయ్. అర్థమయిందా... లేదా? కాకుంటే నువ్వో పనిచేయాలి. తెలివిగా!"

"చెప్పండి సార్!" ఆతృతగా అన్నాడు, రంగారావు.

"ముందిక్కడో స్విమ్మింగ్ పూల్ వుండేది. పక్కనే వున్న స్కూలు పిల్లలు - పూల్‌లో పడిపోయి, మునిగిపోయే ప్రమాదం వున్నందున, ఈ కొలన్ని పూడ్చివేశాం' అంటూ చక్కగా ఓ బోర్డు రాయించి, దాన్ని ఈ స్థలంలో పాతి పెట్టించు. అర్థమయింది కదా!"

తన బుద్ధి కుశలతతో కోటి రూపాయల స్విమ్మింగ్‌పూల్ కుంభకోణాన్ని భూస్థాపితం చేసి, భారీగా లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకున్న లక్ష్మీప్రసాద్‌ను 'అత్యంత అవినీతి ఆఫీసర్ (అ. అ. ఆ) అవార్డుకు గుడి లింగేశ్వరరావు రెకమండ్ చేశాడని వేరే చెప్పనక్కరలేదనుకుంటాను.

○

## సంగీతం - సంసారం

సప్త స్వరాలతో
శత సహస్రరాగాలు
పలికించేదే
సంగీతం
ఏడడుగులతో
అనంత కోటి అనురాగాలు
పండించేదే
సంసారం

– వై.కె. మూర్తి